క్లుప్తంగా

పారిశ్రామిక సమస్యలపై వైవీ సుబ్బారెడ్డికి వినతి



వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ధనలత

మల్కాపురం : టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ మళ్ల ధనలత సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పారిశ్రామిక ప్రాంతంలో పలు పరిశ్రమలు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించట్లేదని, కొన్ని పరిశ్రమల నుంచి మోతాదుకు మించి కాలుష్యం వెలువడుతోందని, దీనిపై అధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు ధనలత తెలిపారు.

జోన్-5 ఏఎంహెచ్‌వోగా సునీల్‌కుమార్



జెడ్సీ కృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎంహెచ్‌వో సునీల్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వోగా డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ జోన్-3కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణను సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జోన్ పరిధిలో మెరుగైన పారిశుధ్యానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు సహకరించాలని ఆయన కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జోన్-5ను మొదటి స్థానంలో ఉంచేలా కృషి చేస్తానన్నారున.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామికి పూజ చేస్తున్న వేదపండితులు, ఆలయ కమిటీ చైర్మన్

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఉత్సవమూర్తికి సోమవారం పంచామృతాభిషేకాలు జరిపించారు. సాయంత్రం కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఈ.కె.చారి దంపతులు పూజలు చేశారు. సాగినాయుడు, నర్సింగరావు, ఎం.ఉమామహేశ్వరరావు,గురునాథ్ పాల్గొన్నారు.

కన్నారావు మృతి తీరని లోటు



సంతాప సభలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారామ్

అగనంపూడి: సీఐటీయూ అగనంపూడి ఇన్‌చార్జి ఉప్పల కన్నారావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటని ఏపీ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ , 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ అన్నారు. అగనంపూడి దిబ్బపాలెంలో సోమవారం నిర్వహించిన కన్నారావు సంతాప సభలో పాల్గొన్న వారు, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ 87వ వార్డు ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, సీపీఎం, టీడీపీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత



జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మొక్క నాటుతున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు



పారిశుధ్య కార్మికురాలికి టోపీ అలంకరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

మల్కాపురం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని, సకల జీవరాశుల్ని సంరక్షించాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోరమాండల్ సంస్థ సిద్ధం చేసిన క్లాత్ బ్యాగ్‌లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తమ ఇళ్ల ముందు మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కోరమాండల్ జనరల్ మేనేజర్(హెచ్ఆర్) శ్రీనివాస్‌రావు, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- పర్యావరణ దినోత్సవంలో భాగంగా కోరమాండల్ సంస్థ ఆవరణలో సుమారు పది వేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. శ్రీహరిపురం వద్ద 500 క్లాత్ బ్యాగులను పంపిణీ చేసింది.
- మల్కాపురం శాఖా గ్రంథాలయంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కల వలన ప్రయోజనాలు, చెట్ల నరికివేత వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు బి.సత్యానందం, రచయిత కె.సత్తిరాజు పాల్గొన్నారు.
- మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల వద్ద పర్యావరణ దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి కళాశాల అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన పెంచారు.
- మల్కాపురం ప్రాంతానికి చెందిన కాకి సంతోష్ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తన సొంత నిధులతో పారిశ్రామిక వాడలోని పలు ప్రాంతాల్లో మొక్కలను నాటారు.

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఫౌండేషన్ సభ్యుడు సాలాది కృష్ణయ్య మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పిన్నమనేని శ్రీనివాసరావు, ఆదినారాయణ, రామారావు, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, చిన్నారులు

సింధియా: ఆరోగ్యవంతమైన జీవనశైలికి ప్లాస్టిక్‌ను విడనాడి ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులను స్వచ్ఛ సర్వేక్షణ్ టోపీలతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో పారిశుధ్యకార్మికుల పాత్ర అమోఘమని అభినందించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సూపర్‌వైజర్ శ్రీను, మేస్త్రీ కొండబాబు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. షిప్‌యార్డ్‌కాలనీలోని జీవీ నిలయం క్రీడామైదానంలో నిర్వహించిన జగనన్న వేసవి శిక్షణ శిబిరం సోమవారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, షిప్‌యార్డ్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చంటిబాబు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరంలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో మేయర్, కమిషనర్ శ్రద్ధతో సమ్మర్ క్యాంపులు నిర్వహించడంతో పాటు పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించారన్నారు. బాక్సింగ్ కోచ్‌లు గుర్రాల రామారావు, సాహు అందించిన శిక్షణ అద్భుతమని అభినందించారు. చిన్నారులు క్రీడల్లో శిక్షణ తీసుకుని మెడల్స్‌తో పాటు స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, పెంట్ల బాలకృష్ణ, శివ, ప్రభాకర్, కిరణ్, సంతోష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 03 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 01, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ-2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

గోపాలపట్నం: ఒడిశా రాష్ట్రం బాలాసోర్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మరణించిన ప్రయాణికుల ఆత్మలకు శాంతి కలగాలని నేవల్ ఆర్మెంట్ డిపో వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఐఎన్‌టీయూసీ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఇది చాలా ఘోరమైన ప్రమాదమన్నారు. ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఏడీ కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

అమిత్‌షా పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

గోపాలపట్నం: కేంద్ర మంత్రి అమిత్‌షా విశాఖ పర్యటన ఏర్పాట్లపై బుచ్చిరాజుపాలెంలోని పశ్చిమ నియోజకవర్గ బీజేపీ కార్యాలయం సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ ఈ నెల 11న అమిత్‌షా బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఆ సభకు ప్రజలను సమీకరించాలని పిలుపునిచ్చారు. ఆయన రాకను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందుకోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. పశ్చిమ సమన్వయకర్త దాడి పుషోత్తమరమేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పైడా వేణుగోపాల్, రాష్ట్ర సభ్యత్వ ప్రముఖ్ జీసీ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాసరావు, దిలీప్ వర్మ, బాలరాజేశ్వరరావు, వలిరెడ్డి శ్రీనివాసరావు, జి. వెంకటేశ్వరరావు, కె. సత్యనారాయణ, ఎస్. గజపతి, చల్ల మంజుల, ఎస్ జ్యోతి, బి. నారాయణరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెక్టార్ ఆచార్య సమత

ఏయూక్యాంపస్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న పర్యావరణ పరిరక్షణకు 7 సూత్రాలు కార్యక్రమ పోస్టర్‌ను ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం ఆవిష్కరించారు. ఏయూ జాతీయ సేవా పథకం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. చెత్తను తగ్గించడం, విద్యుత్ ఆదా చేయడం, ఇ-వ్యర్థాలను తగ్గించడం, నీటి ఆదా, ఆరోగ్యకర జీవనశైలిని అలవరచుకోవడం , భరించ దగిన ఆహార విధానాలు ఎంచుకోవడం వంటి అంశాలతో ఈ పోస్టర్‌ను తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ శశిప్రభ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘోషాస్పత్రికి లక్ష్య నేషనల్ సర్టిఫికెట్

- లేబర్ రూమ్ నాణ్యత ఆధారంగా ఎంపిక

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ విక్టోరియా(ఘోష) ఆస్పత్రి లేబర్ రూమ్ నాణ్యత అంశంలో లక్ష్య నేషనల్ సర్టిఫికెట్ పొందింది. 2017 డిసెంబర్‌లో లక్ష్య ప్రోగ్రామ్ ప్రారంభించింది. లేబర్ రూమ్‌లో మెరుగైన సంరక్షణతో పాటు నవజాత శిశువుల మరణాలను తగ్గించడం లక్ష్యంగా అమలు చేసిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి 70శాతం మేర లక్ష్యాన్ని సాధించి, సర్టిఫికెట్ పొందేందుకు అర్హత సాధించిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషారాణి తెలిపారు.

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అందించిన సహకారం వల్ల ఈ లక్ష్యాలు సాధించగలిగామన్నారు. దీని వల్ల మెడికల్ కాలేజీ, డిస్ట్రిక్ట్ ఆస్పత్రి నుంచి ప్రోత్సాహకాలు వస్తాయన్నారు. ఐఎస్ఆర్ నుంచి వరసగా 12 లక్షల రూపాయలు మంజూరు చేస్తారని తెలియజేశారు.

ఉక్కు కర్మాగార పరిరక్షణ ప్రజలందరి బాధ్యత



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 844వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని పార్లమెంట్‌లో నాయకులు గళమెత్తాలన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కోవడం కోసం కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్‌పై ప్రమాదం

- చావుబతుకుల్లో ఎలక్ట్రికల్ ఉద్యోగి రమణ



విద్యుత్ స్తంభంపై ప్రమాదానికి గురైన ఉద్యోగి రమణ

కంచరపాలెం: కరెంట్ పోల్‌పై ఎలక్ట్రికల్ పనిచేస్తూ ఉద్యోగి ఒకరు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. 46వ వార్డు కైలాపురం పరిధి లక్ష్మీనారాయణనగర్ జోసెఫ్ చర్చి రహదారిలో సోమవారం సాయంత్రం విద్యుత్ స్తంభంపై పనిచేస్తున్న ఎలక్ట్రికల్ ఉద్యోగి రమణ కరెంట్ షాక్‌కు గురై చావుబతుకులతో పోరాడుతున్నాడు. కైలాపురం ఏపీఈపీడీఎల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో విద్యుత్ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సమయంలో వీధిలైట్లు వేసే వ్యక్తి విద్యుత్ కనెక్షన్‌కు లైన్లు కలపడంతో ప్రమాదం చోటు చేసుందని అధికారులు తెలిపారు. ఆ సమయంలో తోటి సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా ఆఫ్ చేసి పోల్‌పై చిక్కుకున్న రమణను జాగ్రత్తగా కిందకు దించి ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ దరి ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. వైద్య సిబ్బంది అత్యవసర వైద్య సేవలందిస్తున్నారు. విద్యుత్ అధికారులు ఆస్పత్రికి వెళ్లి రమణ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

16 నుంచి యోగా సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఏయూ యోగా కేంద్రం ఈ నెల 16, 17వ తేదీల్లో సదస్సు నిర్వహిస్తోంది. బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో జరిగే సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బెంగళూరుకు చెందిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ యోగిక్ సైన్సెస్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.తులసీరావు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కూర్మన్నపాలెం : ఆర్థిక వివాదంతో వచ్చిన నిందారోపణల కారణంగా మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్‌కు చెందిన అడుసుమిల్లి వీర శంకరరావు(37) ఐఎన్ఎస్ క్యాంటీన్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో క్యాషియర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కంపెనీకి చెందిన ఆర్థిక లావాదేవీల్లో వివాదాలు తలెత్తడంతో వచ్చిన నిందారోపణల వల్ల వీర శంకరరావు మనస్తాపానికి గురై రాజీవ్‌నగర్‌లోని మూడంతస్తుల భవనం మీద నుండి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. దువ్వాడ పోలీసులు ఆత్మహత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లలితా పీఠానికి భక్తుల క్యూ



లలితా పీఠాధిపతిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామి దర్శనం కోసం నిరీక్షిస్తున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి భక్తులు పోటెత్తుతున్నారు. లలితా పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి నాలుగు నెలల తర్వాత పీఠానికి వచ్చారు. దీంతో ఆయన దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరుతున్నారు. జూలై 3వ తేదీ నుంచి సెప్టెంబర్ 29 వరకు చాతుర్మాస దీక్షలు జరగనుండటంతో.. ఏర్పాట్ల నిమిత్తం స్వామీజీ పీఠానికి విచ్చేశారు. సుమారు మూడు నెలల పాటు పీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులను దర్బార్ హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతిస్తున్నారు. పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. స్వామీజీని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు.

వాతావరణ, సముద్రశాస్త్రంపై శిక్షణ



శిక్షణకు హాజరైన వారితో ఆచార్యులు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయ వాతావరణ, సముద్రశాస్త్ర విభాగం, ఎన్ఐటీ వరంగల్ సంయుక్త నిర్వహణలో వారం రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏయూ జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ తరగతులకు విభిన్న విశ్వవిద్యాలయాల నుంచి 36 మంది పరిశోధకులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్ఐటీ వరంగల్ సమన్వయకర్త జి.ఆర్.ఆర్.సంజీవిని, ఏయూ వాతావరణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.సునీత తదితరులు ప్రసంగించారు. శిక్షణ తరగతుల్లో భాగంగా సముద్ర-వాతావరణ అంశాలలో తమ విభాగం ప్రగతిని వివరించారు. 11వ తేదీ వరకు ఈ ప్రత్యేక శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి.

శానిటేషన్ సెక్రటరీల నిరసన

మహారాణిపేట: రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం శానిటరీ సెక్రటరీలు ఆందోళన చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు స్పందనలో అందజేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం వార్డు సచివాలయ ఎన్విరాన్మెంట్ శానిటరీల సెక్రటరీ అసోసియేషన్ నాయకులు కె.పీటర్, ఎస్.పార్థసారథి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా వార్డు సచివాలయంలో పని చేస్తున్న శానిటేషన్-ఎన్విరాన్మెంట్ సెక్రటరీలుగా పని చేస్తున్న మహిళలను కూడా తెల్లవారుజామున 4.30 గంటలకు రావాలని ఆదేశాలు జారీ చేస్తుండడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందు చూపుతో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయం వ్యవస్థ స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తూ, ప్రతి చిన్న కారణానికి మెమోలు, షోకాజ్‌లు, సస్పెన్షన్‌లు చేస్తూ ఉద్యోగుల్లో అభద్రత భావం కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్.ప్రసన్న, ఝాన్సీరాణి, భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, ఆదారి శివ తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది

బీచ్‌రోడ్డు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో సాగరతీరంలో వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేసి తీరాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన హెచ్‌పీసీఎల్ ఈడీ వీరభద్రరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తొలగించడడానికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. మెరుగైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ అధికారులు సి.మురళీ కృష్ణ, బి.వి.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.